# వివేకభ్రష్ట సంపాతముల్

**ధ**ర్మారావు దాక్షాయణీ దంపతులు, తమకు చాలా సన్నిహిత కుటుంబంలోని, ఆఖరిపిల్లవాడి పెళ్ళికి వెళ్ళివచ్చారు. సత్యన్నారాయణ వ్రతం మరుసటి రోజు. తప్పకుండా రమ్మని, మరీ మరీ చెప్పారు వాళ్ళు.

"పొద్దున్నే లే! పెందరాళే వ్రతానికి వెళదాం!" అన్నాడు ధర్మారావు.

"ఎందుకూ! మళ్ళీ అక్కడ స్వీట్లు తినడానికా! మీకు షుగర్ వుందికదా! పదే పదే ఆ గులాబ్‌జామ్, ఐస్‌క్రీం కలిపి తినడమేమిటి! నేను మిమ్మల్ని చూస్తూనే వున్నాను".

"వెర్రిమొహమా మనం యిచ్చిన చదివింపులకి తగినట్లుగా తినకపోతే, మనకి గిట్టుబాటుగా వుండదని తిన్నాను" అన్నాడు ధర్మారావు.

"గిట్టుబాటేమిటి మనమేదైనా వ్యాపారం చేస్తున్నామా!" అంది దాక్షాయణి.

"మనం వ్రతానికి వెళ్ళకపోతే వాళ్ళు బాధపడతారు. అదీగాక మన సుపుత్రునికి ఒక మంచి సంబంధం చెపుతానన్నాడు కాకినాడ నుంచి వచ్చిన ఒక మిత్రుడు" అన్నాడు ధర్మారావు.

"ఆమాట చెప్పరేం! అలా అయితే తప్పకుండా వెళదాం! పెందరాళే లేస్తాను".

"పిల్ల జాతకం ఫోటో పంపమని చెప్పాను. మా మిత్రుడు కాకినాడ వెళ్ళిన తర్వాత వాళ్ళతో చెపుతానన్నాడు".

ఓ రోజు సాయంకాలం యింటికి వచ్చేసరికి నవ్వుతూ చెప్పింది, దాక్షాయణి. ఫోటో జాతకం కాకినాడ నుంచి వచ్చాయి. పిల్ల చాలా బాగుంది. లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. ఇదిగో మీరు కూడా చూడండి" అని ఆ పిల్ల ఫోటో ధర్మారావుకి యిచ్చింది.

ఫోటో చూసిన ధర్మారావు మొహంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

"ఏమిటి, సంతోషించడానికి బదులు అలా విచారిస్తారేమిటి?" అంది దాక్షాయణి.

"ఏం లేదు! ఈ పిల్ల ముఖం చూస్తే దివ్యతేజస్సుతో వుంది. మనస్సు

నిర్మలంగా ఉంటే తప్ప ముఖంలో ఆ వెలుగు ఉండదు. పైగా పెద్ద తెలివైనదానిలా లేదు. మనవాడు చూస్తే సకలగుణాభిరాముడు. తాగితందనాలాడుతున్నాడు. పైగా ఈ మధ్య పేకాట కూడా మొదలుపెట్టాడు. ఈ అమ్మాయికి ద్రోహంచేసిన వాళ్ళమవు తామేమోనని బాధగా వుందే".

"బావుంది. మీ వరస! పెళ్ళైతే అన్నీ, వాటంతటవే సర్దుకుంటాయి. ఏదో పిల్లలు పెళ్ళవకముందు బాధ్యతలు లేక, అల్లరిచిల్లరిగా తిరుగుతుంటారు. అంత మాత్రాన పెళ్ళి చెయ్యకుండా వదిలేస్తామా! అయినా మీకు తెలుసుగా మా అన్నయ్య కొడుకు కూడా పెళ్ళవక ముందు, మన వాడిలాగే వుండేవాడు. పెళ్ళయిన తరువాత వాడి రోగం కుదిరింది. భార్య చెప్పుచేతల్లో కుక్కిన పేనులా పడివున్నాడు" అంది దాక్షాయణి.

"మంచిదే! మేనత్త మేనమామల పిల్లలకి మంచిగా మారడం విషయంలో కూడా సమానమైన పోలికలు వస్తే, అంత కంటే అదృష్టమా!"

భోజనాలయిన తర్వాత నిద్రపోదామనుకున్న ధర్మారావుకి నిద్రపట్టలేదు. ఇతనిది చాలా సున్నితమైన మనస్సు. పైగా పేరుకి తగినట్లు ధర్మచింతన కలవాడు. ఎవరికైనా అన్యాయం చేస్తే అది ఏదో రూపంలో వచ్చి బాధపెడుతుందన్న నమ్మిక కలవాడు. అందుకనే పెళ్ళయిన తర్వాత కూడా, తన కొడుకు ఈ వ్యసనాలు మానకపోతే, వచ్చే కోడలు కష్టాలకోర్చలేక ఏ ఆత్మహత్యయినా చేసుకుంటే, తన కుటుంబం పరువు పోతుందని భయం! పైగా, ఈ ఉసురు తగిలి తన పెళ్ళవవలసిన కూతురికి ఏదైనా ఘాతుకం జరుగుతుందేమోనని జంకు!

ధర్మారావు మధనపడుతున్నాడన్న సంగతి కనిపెట్టిన దాక్షాయణి, "ఏమిటి ఆలోచిస్తున్నారూ! మనవాడికి పెళ్ళి చెయ్యడం మన బాధ్యత. అసలు ఆ మాటకొస్తే పెళ్ళిళ్ళు దైవనిర్ణయం ప్రకారం జరుగుతాయి. మనవాడు మారితే మంచిదే, లేకపోతే ఆ పిల్ల తన కర్మను బట్టి అనుభవిస్తుంది. ఇవ్వన్నీ దైవ నిర్ణయాలనుకోవాలి. అంతేకాని ప్రతీదానికీ ఆలోచిస్తూంటే పిచ్చెక్కుతుంది" అంది.

"చాలా బాగుంది. ఏం చదువుకోకపోయినా ఎప్పటికి ఏం చెపుతే సరిపోతుందో, అలా చెప్పడం నీకు బాగా తెలిసిన విద్య. పెళ్ళిచూపుల్లో "సమయానికి తగు మాటలాడి" అన్న కీర్తన పాడినప్పుడైనా, నీగొప్పతనం తెలుసుకోలేకపోయాను'.

"మన పెళ్ళిచూపుల గొడవెందుకు? అబ్బాయి పెళ్ళి చూపులేర్పాటు చెయ్యండి.

"అదికాదు దాక్షాయణీ! నేనొక్క మాటడుగుతాను. ఆవేశపడకుండా చెప్పు. మనకీ ఒక ఆడపిల్ల ఉంది కదా! దానికి ఏదైనా చెడ్డ సంబంధం వస్తే మనం బాధపడతాం కదా. సాటి ఆడదానిగా యింకో ఆడపిల్ల మన అమ్మాయిలాంటిదేనన్న ఆలోచన నీకెందకు కలగదూ!"

"మహాప్రభో! మీరు న్యాయశాస్త్రం చదువుకున్నారని, న్యాయశాస్త్ర నిపుణులనీ, మీ నరనరాలలో ప్రవహించేది రక్తం కాదనీ, న్యాయశాస్త్రామృతమనీ నాకు తెలుసు. నన్ను వేధించక నిద్రపోండి. వాడికి కళ్యాణయోగం లేకనే మనకి పుట్టాడేమో అనిపిస్తోంది" అంటూ నిప్పులు చెరిగింది, ఆ వేసవి రాత్రిలో, దాక్షాయణి.

ధర్మారావు తన ధర్మపత్ని చెప్పినట్లే చెయ్యడానికి నిశ్చయించుకున్నాడు.

కాకినాడ నుంచి ఆ పిల్ల తండ్రీ, మేనమామ, పిల్లను చూసుకోడానికి రమ్మని చెప్పడానికి , వైజాగ్ స్వయంగా వచ్చారు.

వాళ్ళు వచ్చేముందు దాక్షాయణి, ధర్మారావుకి కొన్ని ముఖ్యమైన విషయాలు- వాళ్ళు వచ్చినప్పుడెలా మాట్లాడాలి, ముఖ్యంగా దైవానికి సంబంధించిన విషయాలు ప్రస్తావన చెయ్యమనీ, దానివలన తమ కుటుంబంమీద సదభిప్రాయం కలుగుతుందనీ, యిక పిల్లాడి గురించి ప్రత్యేకంగా ఆరా తియ్యరనీ చెప్పింది.

సహధర్మచారిణి దాక్షాయణీ చెప్పినట్లు వింటూ, సహధర్మ భర్త అయ్యాడు ధర్మారావు.

వాళ్ళు వచ్చేవేళకి పట్టుపంచె కట్టుకుని, ప్రస్ఫుటంగా ఒక నామం తీర్చిదిద్దుకుని దేవుని దగ్గర కూర్చున్నాడు.

వాళ్ళు రాగానే దాక్షాయణి వాళ్ళకి కాఫీ యిచ్చింది. "ఆయన వచ్చేస్తారు. మీరు వచ్చేసరికి అనుష్ఠానం పూర్తిచెయ్యాలని, పెందరాళే పూజ మొదలుపెట్టారు" అంది.

"అయ్యో దానికేముందమ్మా! మీది ఒక యిల్లుకాదు. ఒక దేవాలయంలా వుంది" అన్నారు వాళ్ళు.

లోపల్నుంచి వచ్చిన ధర్మారావు వాళ్ళకి తీర్థప్రసాదాలు యిచ్చాడు.

అవి తీసుకుని, చాలా ఆనందపడ్డారు వాళ్ళు.

'జై దాక్షాయణీ!' అని లోపలనుకుని, యిక మొదలుపెట్టాడు ధర్మారావు.

'మీకు ఈ నైవేద్యం పెట్టిన ప్రసాదం యిచ్చాను కదా! అసలా నైవేద్యం దేవుడికి ఎందుకు పెట్టాలన్న విషయం మనలో చాలా మందికి తెలియదు. తెలీదన్నానని ఏమైనా అనుకుంటున్నారా?"

"చిత్తం! లేదండి. నిజంగా మాకు కూడా తెల్లియదు. మాకు తెలీదని, మీరేమీ అనుకోకండి" అన్నారు వాళ్ళు.

ఎదుటి వాళ్ళకి తెలియనప్పుడు చెప్పడం హాయి!. వినేవాడు, అమాయకుడైతే చెప్పేవాడు వేదాంతి!

"అసలీ దస్తావేజులన్నీ పక్కకి పెడితే, ఈ భూమి అంతా దేవుడిది. ఎవరి భూమైనా మనం కౌవులుకి తీసుకుంటే, పండించినందుకుగాను అతి తక్కువ భాగం తీసుకుని, ఎక్కువ భాగం ఆ భూస్వామికి యిస్తాం. అందుకే పరమాత్ముడైన ఆ భూస్వామికి కొంచెమైనా నైవేద్యం పెట్టాలి" అన్నాడు ధర్మారావు.

'శభాష్ ధర్మారావు!' అనుకుంది దాక్షాయణి. కాబోయే కన్యాదాత కళ్ళమ్మట, తన్మయత్వం వలన నీళ్ళురాలాయి.

పెళ్ళిచూపులకి ఒక మంచిరోజు నిర్ణయించుకుని కాకినాడ వెళ్ళారు. పిల్లని చూసి ఏ విషయం ఒక వారంలో తెలియపరుస్తామన్నారు. ఏదైనా పిల్లాడి అవలక్షణాలు, వాళ్ల చెవిని పడతాయోమనన్న భయంతో, నాలుగు రోజుల వ్యవధిలోనే పిల్ల నచ్చిందని, మిగిలిన విషయాలు మాట్లాడుకోటానికి రమ్మని కబురు పంపారు.

పిల్ల తల్లి, సంబంధం ఖాయం చేసుకునే ముందు, ఆ కుర్రాడి గురించి వాకబు చేస్తే మంచిందంది. "నీ మొహం! అసలు వాళ్ళ యింటికి వెళ్ళి, వాళ్ళ ఆచార వ్యవహారాలు చూస్తే నువ్వీ మాటనవు!" అంటూ, "దేవుడికి నైవేద్యం ఎందుకు పెడతారో తెలుసా?" అని అడిగాడు పిల్ల తండ్రి.

ఆవిడ తెలియదందంది. "నీకేం తెలుస్తుందిలే! నాకే తెలీలేదు" అన్నాడు పిల్ల తండ్రి.

"ఆ మాటకొస్తే బావకేమిటి?! నాకే తెలియలేదు" అన్నాడు పిల్లమేనమామ, తన బావగారి కంటే గొప్పవాడన్నట్లు.

అంతకు ముందు ధర్మారావు చెప్పింది చెప్పినట్లు, చెప్పాడు పిల్ల తండ్రి.

"చాలా గొప్ప విషయం. ఈ సంబంధం అయితే మనమదృష్టవంతులమే!" అంది ఆవిడ.

ఈ సంబంధమే ఖాయమైంది. ధర్మారావు దాక్షాయణీ దంపతులకి కోడలు వచ్చింది. 'కన్యాం కనక సంపన్నాం' అనే పెళ్ళి మంత్రాలు అర్థవంతమయినాయి. ధర్మారావు కొడుక్కి పెద్ద ఉద్యోగం వచ్చింది. హోదాతో పాటు ఖర్చులు పెరిగాయి. నిత్యం యింట్లోనే మద్యపానం చేస్తున్నాడు. ధర్మారావు కోడలు మాత్రం, తన భర్త వ్యసనాల విషయం పుట్టింటి వారికి తెలియనివ్వలేదు. భర్త భోజనం మాత్రం తెల్లారకట్ల నాలుగు గంటలకి చేసేవాడు. కోడలు పడే వ్యధ చూడలేక, ఒకసారి ధర్మారావు అన్నాడు "చూశావా దాక్షాయణీ! కుర్రాడు పెళ్ళైతే మారతాడనుకున్నావు. వీడు వ్యవసనాలకి బానిస. చూస్తూ, చూస్తూ యింకో ఆడపిల్ల జీవితం సర్వనాశనం చేసాం. రాత్రి తెల్లవార్లూ వీడితో మేల్కొని, తెల్లారితే, రోజూ ఆఫీసుకి వెళ్ళి ఉద్యోగం చేస్తూ ఆ పిల్ల నలిగిపోతుంది. ఈ ఉసురు మనకి తగులుతుందేమోనని భయంగా ఉంది నాకు".

"మీరు చెప్పేది నిజమేననిపిస్తోంది నాకు. వీడి పెళ్ళై ఏడాది దాటిపోయింది. వీడి దురలవాట్లు మానుకోలేదు. వీడికి పెళ్ళి అనవసరంగా చేశామనిపిస్తోంది, నాకు కూడా!" అంది దాక్షాయణి.

'నీకాలస్యంగా జ్ఞానోదయమయింది' అనుకున్నాడు ధర్మారావు.

చాలా విధాల చెప్పారు కొడుక్కి, ఈ అలవాట్లు మానెయ్యమని. అయినా వినలేదు ఆ నిశాచరుడు. కోడలు మాత్రం స్త్రీ సహజసిద్ధమైన సహనం చూపుతోంది.

కొన్నాళ్ళ తర్వాత ధర్మారావు కూతురు పెళ్లైంది. అల్లుడు కూడా యధాశక్తి మద్యపానం చేసేవాడే దొరికాడు. పైగా యితని కూతురుకి, కోడంటికం కూడా కల్గింది. కూతురు కూడా సుఖపడడం లేదు. ఇటు ఒక ఆడపిల్లని కోడలుగా తెచ్చుకుని, తెలిసి, తెలిసి నరకకూపంలో పడేసినందుకేమో, కూతురిక్కూడా యించుమించు అటువంటి సంబంధం వచ్చింది. 'చేసుకున్నవారికి చేసుకున్నంత మహదేవా!' అంటే యిదేనేమో!

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 21-7-2005)